09ATP27_09ATP27.qxd 09-01-2025 PM 10:45 Page 1



## హెచ్‌ఎంపీవీ వైరస్ నుండి రక్షణకు కోవిడ్ తరహా జాగ్రత్తలు పాటించాలి

- ప్రతి ఆసుపత్రిలోనూ వైరస్ కేసుల కోసం ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు- ప్రతిరోజూ సాయంత్రం 4 గం॥ జ్వరం కేసుల జాబితా సేకరిస్తున్నాం- రోగి ఆరోగ్య స్థితిని పొందుపర్చడానికి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు తయారు- ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి తనిఖీలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**



ప్రభుత్వాసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్

హెచ్‌ఎంపీవీ వైరస్ నుండి రక్షణ పొందడానికి ప్రతి ఒక్కరూ కోవిడ్ తరహా జాగ్రత్తలు నోరు, ముక్కు మూసి ఉంచేలా మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సామాజిక దూరం పాటించాలని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ వి.పాల్ రవికుమార్ సూచించారు. గురువారం ఆయన నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని 50పడకల ప్రభుత్వకమ్యూనిటీ ఆసుపత్రిని సందర్శించి ఇన్, అవుట్ పేషెంట్ రిజిస్టర్లు, ఐసోలేషన్ వార్డు పరిశీలించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్ విలేఖరులతో మాట్లాడుతూ హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్కటి కూడా నమోదు కాలేదన్నారు. ఈ వైరస్ కేసుల ఎక్కువగా చిన్న పిల్లల్లో నమోదు అవుతున్నట్లు తెలుస్తోందని హెచ్‌ఎంపీవీ వైరస్ ఒక ఫ్లూ లాంటిదేనన్నారు. జలుబు, దగ్గును నిర్లక్ష్యం చేయకుండా తగిన చికిత్స పొందాలని సూచించారు. ముందు జాగ్రత్తలో భాగంగా జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లోనూ హెచ్‌ఎంపీవీ వైరస్ రోగుల కోసం ప్రత్యేకంగా 5 నుంచి 10 పడకలతో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు ఆసుపత్రుల నుండి జ్వరం కేసుల వివరాలు తెలుసుకొంటున్నామని ఆక్సిజన్, వెంటిలేటర్ల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. జ్వరంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు తప్పక రక్తపరీక్షలు నిర్వహించాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఉదయమే కాకుండా అవసరమైతే సాయంత్రం 4 గంటల తరువాత కూడా రక్త పరీక్షలు జరుగాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి రోగికు సంబంధించి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు తయారు చేస్తున్నామని ఆసుపత్రి వచ్చే సమయంలో రోగులు తమ వెంట ఆధార్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు తీసుకొస్తే వారి మొబైల్ ఫోన్‌లో డిజిటల్ మిషన్ యాప్ డౌన్‌లోడ్‌చేసి రోగి స్థితిని పొందుపర్చి ఆభా ఐడీను క్రియేట్ చేయడం జరుగుతుందన్నారు. సదరు ఐడీ నంబర్ ఎంటర్ చేస్తే రోగి స్థితి వివరాలు మొత్తం ఎక్కడైనా తెలుసుకునే వీలుంటుందన్నారు. దివ్యాంగ పింఛన్లపై 15వేల పింఛన్లు తీసుకుంటున్న వారి అర్హతలపై గత మూడు రోజులుగా విచారణ జరుగుతోందని ఈ విచారణ 16 వరకు కొనసాగుతుందని ఆపై 6వేల పింఛన్ లబ్దిదారుల అర్హులపై విచారణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎన్.వి.ఎస్.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఓటిఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

- కర్ణాటక బ్యాంకు మేనేజర్ శ్రీహరి కిషోర్

**అగళి, జనవరి 9 ప్రభాతవార్త**

కర్ణాటక బ్యాంకు మేనేజర్ శ్రీహరికిషోర్ రైతులకు శుభవార్త అందించారు. వ్యవసాయ నిమిత్తం బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించని యెడల వారికి అదనంగా 3 శాతం ఫెనాల్టీ వడ్డీ వస్తుందని, ఇది రైతులకు ఎంతో ఇబ్బంది కరమని మేనేజర్ అన్నారు. వీటితోపాటు రెండు సంవత్సరాల క్రితం వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు మొండి బకాయిలుగా (ఎన్‌పిఏ)గా ఉన్న ఖాతాదారులకు ఓటిఎస్‌ను అవకాశం కల్పిస్తామని మేనేజర్ అన్నారు. పంట రుణాలకు మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. పూర్తి వడ్డీలో రాయితీ ఇచ్చి రుణమాఫీ చేస్తామని ఓటిఎస్(వన్‌టైమ్ సెటిల్‌మెంట్) కింద వడ్డీలో రాయితీ ఇచ్చి రుణమాఫీ చేస్తామని, ఈ అవకాశాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని కర్ణాటక బ్యాంకు మేనేజర్ అన్నారు.

## డీలర్ల సమస్యలను తక్షణం పరిష్కరించండి

**అమరాపురం జనవరి 9 ప్రభాతవార్త**



డీలర్ల సమావేశ దృశ్యం

మండలంలో రేషన్ షాప్ డీలర్ల సమావేశం మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు బంగారు పాలెం తిప్పేస్వామి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి మండల కన్వీనర్ గణేష్ ,మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి , మండల డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీలర్ల సమస్యలపై సమావేశం నందు చర్చించారు. ప్రస్తుతం డీలర్లకు అందుతున్న బియ్యం నందు తూకాలలో చాలా తేడా వస్తున్నట్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని డీలర్లు కోరారు. అదేవిధంగా అమరాపురం జూనియర్ కళాశాల యందు చదువుతున్న 200 మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యహన భోజనం పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టినందున వారికి మండల డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ప్లేట్లు గ్లాసులు అందించేందుకు కృషి చేస్తామని డీలర్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డీలర్లు కోరేవుఓంకార్,, నవీన్, రమేష్, మోహన్ ,రఘు, హిమంత్ రాజు, రాధాకృష్ణ ,జయప్ప, సేకనప్ప, నాగరాజు ,మంజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఎస్‌ఏ పనులనుపరిశీలించిన అధికారులు

**అమరాపురం జనవరి 9 ప్రభాతవార్త**



పాఠశాల వద్ద పనుల పరిశీలన దృశ్యం

అమరాపురం మండలంలో సర్వ శిక్ష అభియాన్ కింద జరుగుతున్న పనులను సర్వ శిక్ష అభియాన్ ఇంజనీర్ రాజశేఖర్ గురువారం పరిశీలించారు. మండల పరిధిలోని నాగోనపల్లి తమ్మడేపల్లి మరియు కస్తూరిబా గాంధీ పాఠశాల యందు సర్వ శిక్ష అభియాన్ పనులను పరిశీలించడంతోపాటు త్రాగునీటి పండ్లను కూడా పరిశీలించారు. పాఠశాలలో ఎస్ ఎస్ ఏ నిధుల కింద జరిగిన పనులను పరిశీలించడంతోపాటు అర్ధాంతరంగా అయిన పనుల నివేదికలను జిల్లా స్థాయి అధికారులకు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మైదుగోళం యుపి పాఠశాలను అప్‌గ్రేడ్‌కు సహకరించండి

-టిడిపి మండల కన్వీనర్‌కు వినతి

**లేపాక్షి, జనవరి 9 ప్రభాతవార్త**

మండలంలోని మైదుగోళం ప్రాథమికనపాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ జయప్పకు పాఠశాల కమిటీ చైర్మన్ షాజహాన్, ఉపాధ్యాయులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో 1వ తరగతి నుండి 8వతరగతి వరకు 134 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. 8వ తరగతి తరువాత 9,10 తరగతులు చదివేందుకు మైదుగోళం నుండి సుదూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. లేదా కర్ణాటక ప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితి వుంటుందన్నారు. గ్రామం నుండి ప్రధాన రహదారికి రావడానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వుండడంతో తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపలేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పలువురు విద్యార్థులు చదువుకోవాలని ఉన్నత చదువును చదువుకునేందుకు బయట ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలను అప్‌డేట్ చేసేందుకు అనుమతించిందని వారు కన్వీనర్ దృష్టికి తీసుకొచ్చారు.

## తిరుమల మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

-ప్రభుత్వ వైఫల్యం కారణంగానే తిరుమలలో తొక్కిసలాట

-విలేఖరులతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**



విలేఖరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

తిరుమలలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ జారీ కేంద్రంవద్ద తొక్కిసలాటలో మృతి చెందిన భక్తుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల వంతున ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఉరవకొండలో విలేఖరులతో మాట్లాడారు. శ్రీవారి దర్శనం టోకెన్ల కోసం వెళ్లి అక్కడ జరిగిన తొక్కిసలాటలో శ్రీవారి భక్తులు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. భక్తులకు అందించే సేవలు అత్యంత పవిత్రమైనవని, శ్రీవారి భక్తుల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ఉంటే ఇలాంటి ఘటనలకు ఆస్కారం ఉండదన్నారు. పవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజు శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసినా అందుకు తగ్గట్టు ప్రభుత్వం, టీటీడీ బోర్డు ఏర్పాట్లు చేయకపోవడం బాధ్యతా రాహిత్యమే అవుతుందన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి కోటి రూపాయల వంతున ఎక్స్‌గ్రేషియా అందించడంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి టీటీడీలో శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని, గాయపడిన వారికి 25 లక్షల చొప్పున సాయం అందించి వారి వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని వై.మధుసూదన్‌రెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## ఘనంగా ఫాతిమా షేక్ 194వ జయంతి

-చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**



ఫాతిమా షేక్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వెనాట్ట వెనాదటి ముస్లీం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 194వ జయంతి వేడుకలు గురువారం ఉరవకొండ పట్టణంలో ఘనంగా జరిగాయి. హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ నియోజకవర్గ అధ్యక్షులు టైలర్ ముల్లా లాలు సాహెబ్ ఆధ్వర్యంలో ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే సమకాలికురాలిగా సాంఘిక దురాచారాలకు వ్యతిరేఖంగా పోరాటం చేయడంతోపాటు విద్యాభివృద్ధి కోసం పాటుపడిన తొలి ముస్లీం మహిళ ఫాతిమా షేక్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చాబాల గ్రామ సర పంచ్ మల్లెల జగదీష్, ఆర్‌ఎంఎం అధ్యక్షులు రహంతుల్లా, సభ్యులు రఫీక్, మైలారంపల్లి భాషా, టైలర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏవీఆర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

-సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా హరిదాసు వేషధారణలు

-పాఠశాల ఆవరణంలో రంగు రంగుల ముగ్గులు వేసిన విద్యార్థినులు

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**



ముందస్తు సంక్రాంతి పర్వదిన వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులు



రంగు రంగుల ముగ్గులు వేసిన చిన్నారులు

పట్టణంలోని ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ విక్రమ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు పాఠశాల ఆవరణంలో రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు నిర్వహించారు. చిన్నారుల పలువురు హరిదాసు వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలువగా వారికి అనాధిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం ధాన్యం పోసి ఆశీర్వచనాలు అందుకున్నారు. పాఠశాల ఆవరణంలో భోగి మంటలు వేసి, పొంగలి తయారు చేసి అందరికీ పంచి పెట్టారు. విద్యార్థులకు గాలిపటాలు ఎగురవేసే పోటీలు నిర్వహించగా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విక్రమ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన సంస్కృతికి, సం ప్రదాయానికి ప్రతీకగా నిలిచే పండగని 3 రోజుల పండుగలో ఒక్కో రోజు ఒక్కో విశిష్టత ఉందని పేర్కొన్నారు.

## రాకెట్ల పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్

-దాదాపు 100 మంది గర్భవతులకు అన్నదానం

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ పావని

మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో గురువారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పావని, డాక్టర్ వెంకటేష్‌నాయక్‌ల ఆధ్వర్యంలో గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, నిత్యం పోషకవిలువలతో కూడినఆహారం భుజించాలని సూచించారు. చలితీవ్రత దృష్ట్యా వెచ్చటిదుస్తులు ధరించాలని, ఛర్మసంరక్షణ చర్యలు తీసుకొని నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు రాకుండా చూడాలని అయోడిన్ కల్గిన ఉప్పును వినియోగించాలన్నారు. బాల్య వివాహాలు, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోరాదన్నారు. ఈ సందర్భంగా రాకెట్లకు చెందిన ముత్తలూరు వెంకటమ్మ వర్ధంతిను పురస్కరించుకొని ఆమె కుమారుడు మాజీ సర్పంచ్ ఎం.అశోక్‌కుమార్ కుటుంబం దాదాపు 100 మంది గర్భవతులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.నాగరాజు, బి.శ్రీనివాసులు, నరసింహులు, సునీల్, అనిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల్లో వ్యాపారాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి

-బలమైన నాయకత్వం, సమర్థవంతమైన సిబ్బంది లేకపోవడంతోనే నష్టాలు -ఎన్‌సీసీటీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కో ఆర్డినేటర్ డా॥ఎస్.ఎల్.ఎన్.టి.శ్రీనివాస్ -ఉరవకొండ పీఏసీఎస్‌లో రైతులతో సమావేశం, అభిప్రాయాల సేకరణ

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**



రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమ దృశ్యం

సహకార సంఘాల్లో వ్యాపారాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని నేషనల్ కౌన్సిల్ ఫర్ కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కో ఆర్డినేటర్ డా॥ఎస్.ఎల్.ఎన్.టి.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఉరవకొండ పీఏసీఎస్ ఆవరణంలో గురువారం సంఘం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సంఘం అభివృద్ధికి వారి సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డా॥ఎస్.ఎల్.ఎన్.టి.శ్రీనివాస్ మాట్లాడుతూ బలమైన నాయకత్వం, సమర్థవంతమైన సిబ్బంది, అధికారుల్లో నిజాయితీ లేకపోవడం, సంఘం సభ్యుల భాగస్వామ్యం కొరవడటంతోపాటు మొండి బకాయిలు పెరిగిపోయి 40శాతంకు మించి రికవరీలు జరుగకపోవడమే సహకార సంఘాల నష్టాలకు కారణమవుతున్నాయన్నారు. సంఘాల కార్యకలాపాలను ఆన్‌లైన్ పూర్తి చేసుకొని ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటే వాణిజ్య బ్యాంకులతో పోటీ పడవచ్చన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తుండటంతోనే బ్యాంకులు లాభాల్లో ఉన్నాయన్నారు. సంఘాల ద్వారా సభ్యులైన రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇవ్వడంతోపాటు రైతుల పండించిన పంటలను మద్దతు ధరతో కొనగోలు చేయాలన్నారు. వ్యాపార కార్యక్రమాలు విస్తరించి రుణాలు ఇవ్వడంతోపాటు రికవరీల రేటు పెంచాలన్నారు. దేశ వ్యాప్తంగా 2 లక్షల పంచాయతీల్లో సహకార సంఘాల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించిందని ఇందుకోసం బైలాల్లో మార్పులు తీసుకొస్తోందన్నారు. సహకార చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి రైతుల అన్ని అవసరాలను తీర్చగలిగేలా సహకార వ్యవస్థ రూపొందించడంపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. బ్యాంకులు లాభాల్లో ఉన్నా వినియోగదారులకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించవని అదే సహకార సంఘం లాభాల్లో ఉంటే డివిటెంట్‌ను అందిస్తుందన్నారు. సంఘం ఖర్చులు ఆదాయానికి లోబడి ఉండాలని, ఆదాయం పెంచుకోవడానికి సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చుకొని మీసేవ తరహా సేవలు అందించాలన్నారు. ఇందుకోసం ఇప్పటికే సిబ్బంది శిక్షణ కూడా పూర్తి అయిందన్నారు. సహకార సంఘాల్లో ఆదాయం పెంపులో భాగంగా పెట్రోల్ బంకులు పెట్టుకోవడానికి కేంద్రం అనుమతిచ్చిందన్నారు. కొన్ని సంఘాలను కలిపి గోదాములు, కోల్డ్ స్టోరేజీలు పెట్టుకునేలా కేంద్రం మంత్రివర్గంలో నిర్ణయించిందని దీని ద్వారా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభిస్తుందన్నారు. గోదాములు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కో ఆర్డినేటర్ డా॥ఎస్.ఎల్.ఎన్.టి.శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఆర్.వి.క్రిష్ణారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సంఘం పర్సన్ ఇంచార్జ్ ఆర్.రవి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రసాద్, ఉరవకొండ పీఏసీఎస్ సీఈఓ మహమ్మద్ గౌస్, ఆమిద్యాల పీఏసీఎస్ సీఈఓ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడిని పరామర్శించిన బీజేపీ మండల కన్వీనర్

**బత్తలపల్లి, జనవరి 9 ప్రభాతవార్త**



క్షతగాత్రుని పరామర్శిస్తున్న మండల బిజెపి కన్వీనర్

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని బిజెపి మండల కన్వీనర్ ఆకులేటి భాస్కర్, మాజీ మండల కన్వీనర్ వీరనారప్పలు పరామర్శించారు. మండలంలోని జ్వాలాపురం గురువారం మధ్యాహ్నం ట్యాంకర్ రోడ్డు దాటుతున్న గొర్రెలను, అడ్డువచ్చిన కొడకండ్ల గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఓబుల పతిని ఢీకొట్టిన ప్రమాదంలో 15 గొర్రెలు మృతిచెందగా, ఒగులపతి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న బిజెపి కన్వీనర్, మాజీ కన్వీనర్ లు అనంతపూర్లోనే ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని త్వరలోనే కోల్కుంటావని, అన్ని విధాల అండగా ఉంటామని తెలియజేశారు.

## ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

**అమరాపురం జనవరి 9 ప్రభాతవార్త**




వేడుకలు దృశ్యం

అమరాపురం ఆదర్శ పాఠశాల యందు గురువారం సంక్రాంతి వేడుకలను కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు ఘనంగా జరువుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఓబులపతి అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో తెలుగు సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో సంక్రాంతి పండుగ యందు భోగి, సంక్రాంతి మరియు కనుమ రోజులలో ప్రజలు ఎలా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారో వివిధ కార్యక్రమాల ద్వారా తెలియజేశారు. పండుగ సంబరాలలో భాగంగా భోగిమంటను వేసి ప్రజలు భోగి పండుగను ఎలా జరుపుకుంటారో విద్యార్థులకు వివరించారు. విద్యార్థినిలు పాఠశాల ప్రాంగణంలో వివిధ రంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో, నవధాన్యాలతో, పుష్పాలతో అలంకరించి వాటిచుట్టూ జానపద గీతాలను పాడుకుంటూ నృత్యం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోలాటం, చెక్కభజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం సంజన్న, రామసుబ్బయ్య, సత్యం, మోహనకృష్ణ, అల్లా బకాష్, వేణుగోపాల్, బాల నాగిరెడ్డి, అమజాన్, శ్రీదేవి, నాగవేణి, మంజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ వ్యాఖ్యాతగా వేణుగోపాల్ వ్యవహరించారు. చివరిగా విద్యార్థులకు సంక్రాంతి పొంగల్ ను పంచారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**బెలుగుప్ప, జనవరి 9 ప్రభాతవార్త**



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ కార్తిక్‌రెడ్డి, లేడీ డాక్టర్ ప్రియాంక

బెలుగుప్ప మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కార్తిక్ కుమార్‌రెడ్డి లేడీ డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మండలంలో పనిచేసే నర్సులు, ఆశావర్కర్లు, 15 ఈవెంట్ల ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గంగవరం, రెండో బహుమతి బెలుగుప్ప, మూడో బహుమతి తగ్గపర్తి గ్రామాలకు అందజేశారు. అందులో భాగంగా సాంస్కృతిక సాంప్రదాయాలతో భోగి మంటలు వేసి ఉత్సాహంగా తిరుగుతూ నృత్యాలు చేశారు. ఈ వెంట్‌ను ఏర్పాటు చేసిన వారికి ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ వెంకటరమణ, సూపర్‌వైజర్లు వసంత, సరోజా, భాగ్యమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణాపై అవగాహన అవసరం

-ఉరవకొండ మున్సీఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ డి.దుర్గా కళ్యాణి -వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు, ప్రోత్సాహకాలు పంపిణీ

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**



పోటీల్లో ప్రతిభ కనబర్చిన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు సర్టిఫికేట్లు, బహుమతులు పంపిణీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జీ డి.దుర్గా కళ్యాణి దృశ్యాలు



బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండి అప్రమత్తంగా ఉండాలని ఉరవకొండ మున్సీఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ, మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్‌పర్సన్ డి.దుర్గా కళ్యాణి అన్నారు. గత డిసెంబర్ 20వ తేదీన మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఆయా అంశాలపై వ్యాసరచణ, షార్ట్ ఫిల్మ్ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గురువారం పట్టణంలోని కోర్టు వద్ద మేజిస్ట్రేట్ సర్టిఫికేట్లు, ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల మేధావిలో ముందుగానే సంక్రాంతి సంబరాలు..

కోలాహలంగా బాలమేధావిలో సంక్రాంతి ముగ్గులు.

**డి.హీరేహాళ్, జనవరి 09 ప్రభాతవార్త:**



సంక్రాంతి సంభరాల్లో భోగి మంటలు నిర్వహిస్తున్న స్కూల్ యాజమాన్యం.



ముగ్గులు వేస్తున్న చిన్నారి..

డి.హీరేహాళ్ మండల పరిధిలోని కల్యం గ్రామంలో ఉన్న బాల మేధావి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు ముందుగానే సంక్రాంతి సంబరాలను పాఠశాల యాజమాన్యం గురువారం కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ యం.వన్నూరు స్వామి మాట్లాడుతూ సంక్రాంతి విశిష్టతను, ప్రాముఖ్యతను తెలుపుతూ యాజమాన్యం నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం మరియు ముగ్గుల పోటీలు యందు విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ పోటీలల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసినట్లు ఆయన తెలియజేశారు. అనంతరం విద్యార్థులు,ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో భోగి మంటలు వేసి కోలాహలంగా సంబరాలు జరుపుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాద్యాయుడు హరికృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా ప్రకటించడం పై హర్షం.

**గుమ్మఘట్ట, జనవరి 09 ప్రభాతవార్త:**



హర్షం వ్యక్తం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు.

మొదటి తరం స్వాతంత్ర సరయోధ్యంలో పాల్గొన్నటువంటి వడ్డే ఓబన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు వడ్డేర సంఘం అధ్యక్షుడు ఎం.దురుగేష్, పూలకుంట వెంకటేష్, హనుమంతప్ప, హనుమన్న, పాపాపారాయుడు, గోవింద తదితరులు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వడ్డేర్లను గుర్తించి వడ్డేర్ల అరాధ్య దైవమన వడ్డే ఓబన్న జయంతిని జనవరి 11వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని, ఆయా జిల్లాల కలెక్టర్లకి జిఓను విడుదల చేయడం ఎంతో సంతోషకరమన్నారు.

## భక్తులు సంయమనం పాటించి సహకరించాలి

**గుంతకల్లు, జనవరి 9 ప్రభాతవార్త**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామని దర్శనానికి వచ్చే భక్తులు సంయమనం పాటించి సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మంచికంటి భాస్కర్ రంగయ్య, పురిమెట్ల నారాయణస్వామిలు అన్నారు. గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వదర్శనానికి ఉదయం 7 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు సమయం వుంటుందన్నారు. ప్రస్తుతం చైనాలో మరో వైరస్ ప్రచారంలో వున్నందున భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. ఆలయ ఆవరణలో ఒంటికాలుపై నిలుచున్న త్రిమూర్తుల విగ్రహం భక్తులకు ఆకర్షణీయంగా వుంటుందన్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుండి దాతలు, ప్రముఖులు దర్శనానికి వస్తారని సర్వదర్శనానికి వచ్చే భక్తులు సూచించిన సమయానికి రావాలన్నారు. ఈ ఏడాది ఆలయంలో శ్రీవారి పాదాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో టోకన్లు తీసుకునే ప్రయత్నంలో ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమని వారు విచారం వ్యక్తం చేశారు. అనంతరం వైకుంఠ ఏకాదశి మహోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ కోశాధికారి గుండా సుధాకర్‌గుప్తా, కమిటీ సభ్యులు సుదర్శన్‌బాబు, జయంతి వెంకట్, ప్రవీణ్‌కుమార్, రమేష్‌రెడ్డి, అశ్వర్థమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

# భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ

**- భూముల సర్వే వందేళ్ల క్రితం జరిగింది.. తహశీల్దారు సుబ్బారావు**

అగళి, జనవరి 9 ప్రభాతవార్త



రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వం భూముల రీ సర్వే చేయిస్తుందని, రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో మండల పరిధిలోని ఏకెడి హళ్లి రైతులతో తహశీల్దారు సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు కన్వీనర్ కుమార స్వామి, కార్యదర్శి ప్రకాష్, సర్వేయర్లు కార్తిక్, రంగా తదితరులు ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వందేళ్ల క్రితం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భూముల రీ సర్వే జరిగిందని తహశీల్దారు తెలిపారు. రీ సర్వే అయిన భూములకు డైక్లాట్, ఆర్ఎస్ఆర్ చేయడంతోపాటు రీ సర్వేలో గ్రామ కంతకం, రాస్తా, చెరువులు, వాగులు, గుట్టలు, కొండలు ఉన్నాయని, పొజిషన్‌లో ఉన్న రైతులకు డైక్లాట్‌లో పట్టాదారులుగా నిర్ధారించారని తెలిపారు. అప్పుడు జరిగిన సర్వే కాక నూర్లే అనంతరం రీ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఏకెడి హళ్లిని ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఎంజాయిమెంట్‌లో లేని వారు, అనుభవం ఉండి ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులకు సంబంధించి చుక్కల భూములుగా అంటే ప్రభుత్వ భూములుగా ఉన్నాయి. తదనంతరం అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేసి రైతులకు డీ పట్టాలను అందజేశారని తెలిపారు. భూమి హక్కులు రికార్డులో ఉండి ఫిజికల్‌గా అనుభవంలో ఉన్న వారికి నోటీసులు అందజేసి వారికి పాస్‌పుస్తకాలు ఇవ్వడానికి సిద్ధం చేస్తామన్నారు. రీ సర్వేలో రెవెన్యూ సమస్యలు ఏమున్నా ఒకరి భూమి మరొకరు అనుభవించడం, హద్దులు తేడా ఉండటం, విస్తీర్ణంలో వ్యత్యాసం, పేర్లు తప్పులుగా ఉండటం, సర్వే నెంబర్లు తప్పులుగా ఉండటం ఒక రైతు భూమి మరో రైతు పేరు మీద ఉండటం, ఈ రీ సర్వేలో సరిదిద్ది రైతులకు న్యాయం చేయడానికి మంచి అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు కోరారు.

# యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపిక పట్ల రామగిరి మండల శాఖ హర్షం

రామగిరి, జనవరి 9 ప్రభాతవార్త



సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి

జనవరి 8వ తేదీ బుధవారం కాకినాడ నగరంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణోత్సవ మహాసభలలో ఎన్నికలలో రామగిరి మండలం గంతి మర్రి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న ప్రస్తుత శ్రీ సత్యసాయి జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా రామగిరి మండల గౌరవాధ్యక్షులు గోపాల్ రెడ్డి మండల అధ్యక్షులు బాలగొండ్ల శివయ్య, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్, నాయకులు సకల చంద్రశేఖర్ సురేష్, మల్లేష్, మల్లికార్జున, ఆది, ప్రసాదు, తదితరులు, మండల కమిటీ పత్రికా ముఖంగా శుభాకాంక్షలు, అభినందనలు తెలియ చేశారు. సత్యసాయి జిల్లా నుంచి 50 సంవత్సరాల తర్వాత మొట్టమొదటి రాష్ట్ర కార్యదర్శిగా జయచంద్రారెడ్డి ఎంపిక కావడం అభినందనీయమని తెలిపింది.

# గొర్రెల మందపైకి దూసుకొచ్చిన ట్యాంకర్ లారీ..

**అడ్డుపడ్డ గొర్రెల కాపరికి తీవ్రగాయాలు**

**15 గొర్రెలు మృతి, మరో 25 గొర్రెలకు తీవ్రగాయాలు**

బత్తలపల్లి, జనవరి 9 ప్రభాతవార్త





రోడ్డుపై మృతి చెందిన గొర్రెలు , తీవ్రగాయాలతో రోడ్డుపై పడిపోయిన ఓబుళపతి

జాతీయ రహదారిపై జ్వాలాపురం క్రాస్ సమీపంలో గురువారం ట్యాంకర్ లారీ గొర్రెల మందపైకి దూసుకువచ్చింది. దీంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ క్రమంలో లారీకి గొర్రెల కాపరి అడ్డురాగా ఆయనను కూడా తొక్కించిన సంఘటన బత్తలపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని కోడేకండ్ల గ్రామానికి చెందిన ఓబుళపతి గొర్రెలు పోషించుకుంటూ జీవిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఆయన, భార్యతో కలిసి గొర్రెలను మేపులకు తీసుకు వెళ్లాడు. జ్వాలాపురం క్రాస్ నుండి రోడ్డును దాటుకుంటున్న సమయంలో కదిరి వైపు నుండి బత్తలపల్లికి వస్తున్న ట్యాంకర్ లారీ వేగంగా దూసుకువచ్చి, గొర్రెల మందపైకి వెళ్లింది దీంతో అక్కడికక్కడే 15 గొర్రెలు మృతి చెందగా, మరో 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ సంఘటనలో గొర్రెల కాపరి లారికి అడ్డురాగా ఆయనపైన కూడా వెళ్లడంతో తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. గొర్రెల కాపరి భార్య గట్టిగా కూతలు వేయడంతో పొలాల్లోని రైతులు, రోడ్డుపై వెలుతున్న వారు రావడం చూసి లారి డ్రైవర్ పరారయ్యాడు. వెంటనే స్థానికులు గొర్రెల కాపరిని ఆర్డిటి ఆసుపత్రికి తరలించారు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచు బండి సరస్వతి, ఎంపిటీసీ సభ్యురాలు బండి రాములమ్మలతో పాటు పలువురు గ్రాముస్థులు కోరుతున్నారు.

# గ్రంధాలయాలతో యువతకు విలువైన విజ్ఞానం.

**జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమ**

తాడిమర్రి జనవరి 9 ప్రభాతవార్త.

గ్రంధాలయాలు యువత భవిష్యత్తుకు విలువైన విజ్ఞానాన్ని ప్రసాదించే భాండాగారాలని అందులో లభించే నవలలు దిన,పత్రికలు వార, మాస ,పత్రికలు చదవడం వల్ల యువత మేధస్సు ను పెంచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి రమ సూచించారు. గురువారం గ్రంధాలయాన్ని వార్షిక తనిఖీ చేసిన ఆమె గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించి పాఠకులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంధాలయాల అభివృద్ధి కోసం పెండింగ్ లో ఉన్నపన్ను బకాయిలను వెంటనే వసూలు చేయాలని గ్రంథాలయ అధికారి సీనా నాయక్ ను ఆదేశించారు. అందుబాటులో ఉన్న విలువైన పుస్తకాలను ఉపయోగించుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు ప్రజలు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ తాడిమర్రి రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ అధికారి.పి. రమ

# సంక్రాంతి పండుగలో గోకులాల ప్రారంభం

అగళి, జనవరి 9 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతులకు విరివిగా గోకులాలను మంజూరు చేసిందని వాటి నిర్మాణాలను దాదాపుగా పూర్తి అయిందని ఏపిఓ శివన్న తెలిపారు. 10 నుంచి 12వ తేది మధ్యలో గోకులాల ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. 10వ తేది ఇనగలూరు, హల్లికెర, మధూడి రావుడి, బ్యాడిగెర పంచాయితీలో ఈ గోకులాల ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. 11న నర్సాంబుది, కోడిపల్లి పంచాయితీలో 12న అగళి పంచాయితీలో ప్రారంభోత్సవాలు చేస్తామని ఏపిఓ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మడకశిర శాసనసభ్యులతోపాటు జడ్పిటిసి, ఎంపిపి, కోఆప్షన్ మెంబర్ సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయితీ కార్యదర్శిలు మండలంలోని విఓ లీడర్లు, ఏపిఎం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ మడకశిర, వీరందరికీ ఆహ్వానం ఉందన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన ..

ధర్మవరం రూరల్ జనవరి 9 ప్రభాతవార్త



న్యాక్ బృందం పర్యటిస్తున్న దృశ్యం

పట్టణంలోని కె. హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8, 9 తేదీలలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ బృందం పర్యటించడం జరిగిందని ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ డా.జె.సదాశివ భట్ "న్యాక్ ఛైర్ పర్సన్",డా. అనిల్ ఓజా "కోఆర్డినేటర్",డా.బాబన్ తైవాడే "మెంబరు"గా న్యాక్ బృంద సభ్యులుగా విచ్చేయడం జరిగిందన్నారు. ఎన్.సి.సి కేడేట్ల ఘన స్వాగతంతో కార్యక్రమం మొదలు కాగా, గత ఐదేళ్ళలోని కళాశాల అభివృద్ధిని, విద్యా కార్యకలాపాలను న్యాక్ సభ్యులకు తెలియజేశారు. న్యాక్ ప్రమాణాలతో కళాశాలలో వున్న మౌలిక వసతులు, బోధన, పరిశోధన వంటి అంశాలతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు , పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసి వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యుయేసి కోఆర్డినేటర్ ఏ.కిరణ్ కుమార్, న్యాక్ కోఆర్డినేటర్ ఎస్.పావని , ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# విద్యార్థులకు వృత్తి విద్య కోర్స్ పై అవగాహన

అమరాపురం జనవరి 9 ప్రభాతవార్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన అమరావురంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య కోర్స్ పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ప్రిన్సిపాల్ టి.శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూవృత్తి విద్య పై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మీ సేవా నిర్వాహకుడు షామీర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వొకేషనల్ ట్రైనర్ బి పుష్పవతి ఆధ్వర్యంలో లేర్నెట్ స్కిల్ ఫర్ లైఫ్ వారి సహకారంతో విద్యార్థులను స్థానిక మీ సేవా కేంద్రం పరిశిలనకై వృత్తి విద్య శిక్షకులు సమక్షంలో సందర్శించడంతోపాటు మీసేవ ద్వారా అందే సేవలను వివరించడం జరిగింది.

# వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చండి

**అధికారులకు వినతి సమర్పించిన వాల్మీకి నాయకులు**

అమరాపురం జనవరి 9 ప్రభాతవార్త



వాల్మీకి నాయకుల దృశ్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించి న్యాయం చేయాలని రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆదేశాల మేరకు అమరాపురం మండల తహసిల్దార్ కార్యాలయం నందు శుక్రవారం వాల్మీకి బోయ కులస్తులు వినతి సమర్పించారు. ఈ కార్యక్రమం నందు రాష్ట్ర వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు జి. టి. అనిల్ కుమార్,ఎంపీపీ ఈరన్న, బై రాజు, హనుమంతరాయ, మంజునాథ్, రామ్మూర్తి, సతీష్, హరి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించి ఆదుకోవాలని వారుడిమాండ్ చేశారు. ముఖ్యంగా సమీప కర్ణాటక రాష్ట్రంలో బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించారని ఇక్కడ మాత్రం బీసీలుగా కొనసాగుతున్నట్లు వారు పేర్కొన్నారు.1956 సంవత్సరంలో ఎలాంటి కారణాలు లేకుండా ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ రాష్ట్రంలో బోయ కులస్తులను ఎస్టీ జాబితా నుండి తొలగించడం జరిగిందని వారు పేర్కొన్నారు. సమీప కర్ణాటక రాష్ట్రంలో ఎస్టీలుగా కొనసాగుతున్న వాల్మీకి బోయ కులస్తులు అత్యధికంగా మడకశిర నియోజకవర్గానికి సత్సంబంధాలు ఉన్నందున ఇక్కడ బీసీలుగా కొనసాగుతున్నదాన్ని పునః పరిశీలించి తమను ఎస్టీ జాబితాలో చేర్పించి న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఎస్టీ జాబితాలో చేర్పించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వాల్మీకి బోయ కులస్తులకు? న్యాయం చేయాలని వారు కోరారు. ప్రభుత్వం ఇప్పటికే కారంశివాజీ కమిషన్, సత్యపాల్ కమిషన్ ద్వారా ఎస్టీ జాబితా లో చేర్పించే విషయంపై నివేదిక కూడా తీసుకున్నట్లు దీన్ని తక్షణం అమలు చేసి న్యాయం చేయాలని వారు వినతిలోపేర్కొన్నారు.

# గర్భిణీలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన, ఎస్సై సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి, జనవరి, 09 ప్రభాతవార్త



ప్రభుత్వ హాస్పిటల్ యందు, గర్భవతులకు భోజనం అందజేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ ఎస్ గేట్, ప్రభుత్వ హాస్పిటల్ యందు గురువారం గర్భిణీ స్త్రీలకు డాక్టర్ రవి నాయక్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ ( p m s m a ) కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రతి నెల 9వ తారీకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గర్భతులకు వైద్య పరీక్షలు, నిర్వహిస్తారు, అందులో భాగంగా గురువారం65 మంది గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు ఈ సందర్భంగా డాక్టర్ రవి నాయక్ గర్భిణీ స్త్రీలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు ఈ సందర్భంగాసి.కె.పల్లి పోలీస్‌స్టేషన్, సబ్‌ఇన్స్పెక్టర్, సత్యనారాయణ సొంత ఖర్చులతో, గర్భిణీ స్త్రీలకు అలాగే ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి, భోజన సౌకర్యం కల్పించారు, ఈ భోజన సౌకర్యం,తన సిబ్బంది మొత్తం వచ్చి, వారిచేతుల మీదుగా గర్భవతులకు వైద్య సిబ్బందికి అందించడం జరిగింది,. ఈసందర్భంగా, గర్భిణీ స్రీలందరు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ రవి నాయక్ ఎస్.ఐ సత్యనారాయణ తో పాటు గోవిందమ్మా. సి.హెచ్.ఓ,పద్మావతి. పి.హెచ్.ఎన్, రామలక్ష్మి. వెంకటనారాయణ,సూపర్వైసార్బ్ ,ఎమ్.ఎల్. హెచ్.పిలు, ఏ.ఎన్.ఎమ్ లు. ఎల్.టీ, ఆశలు అందరు పాల్గొన్నారు.

# వీఆర్ఎస్ తీసుకున్న ఉరవకొండ ఆర్టీసీ డీఎం

**-నేడు చివరి రోజు విధులు నిర్వహించనున్న బాలాజీ దయాల్**

ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త



ఉరవకొండ ఆర్టీసీ డీఎం బాలాజీ దయాల్

ఉరవకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీ దయాల్ వాలంటరీ రిటైర్‌మెంట్ (వీఆర్ఎస్) తీసుకున్నారు. దాదాపు ఏడాది కాలంగా వీఆర్ఎస్ కోసం ప్రయత్నిస్తుండగా ప్రభుత్వం ఇటీవల ఆమోదముద్ర వేసింది. దీంతో ఆయన శుక్రవారం (నేడు) చివరిరోజు విధులు నిర్వహించి స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా డీఎం బాలాజీ దయాల్ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ 38 సంవత్సరాలపాటు ఉద్యోగం చేశానని ఉద్యోగ విరమణకు మరో ఏడాది గడువు ఉందని ఇలోపే వీఆర్ఎస్ తీసుకోవాలని నిర్ణయించి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.

# మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా బత్తలపల్లి ఎంపిక

బత్తలపల్లి, జనవరి 9 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఐఆర్డీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు

బత్తలపల్లి గ్రామ పంచాయతీని మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు, పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గురువారం బత్తలపల్లి గ్రామ పంచాయతీలోఖి ఎన్ఐఆర్డి(నేషనల్ ఇన్స్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్) నుంచి రాష్ట్ర కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ నుంచి డీపీఓ నిర్మల్ ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సమావేశమయ్యారు. పంచాయతీలో సర్పంచు అక్కెం కాశమ్మ, మండల పరిషత్లో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జిల్లా ప్రాదేశిక మెంబర్గా సుధ ఎన్నికయ్యారన్నారు. అదేవిధంగా పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో మహిళా మార్ను నిర్వహిస్తున్నారన్నారు. మహిళలు, మండల అధికారులు సమన్వయం చేసుకొని పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది. మండలస్థాయి అధికారులు అందరూ కోఆర్డినేషన్తో పని చేసి బత్తలపల్లి పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. తద్వారా ప్రోత్సాహక బహుమతి కింద రూ.కోటి ఇస్తారని తెలియజేశారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయం. గ్రామ సచివాలయం. ఐకేపీ కార్యాలయంలో అధికారులతోనూ, మహిళలతోనూ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి: ఎంపీడీకు నరసింహనాయుడు, ఈ ఓ ఆర్ డి క్రిష్టప్ప, ఎఓ శ్రీనివాసులు ఏపీఎం సుదర్శన్ రాజు, పంచాయతీ కార్యదర్సులు, గ్రామ సచివాలయ సిబ్బంది. పొదుపు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

పెనుకొండ జనవరి 9 ప్రభాతవార్త



సంక్రాంతి సంబరాలు కరపత్రాలను విడుదల చేస్తున్న తెలుగుదేశం నాయకులు

పట్టణంలో ఈనెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు మూడో రోజులపాటు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ చేనేత జోలి శాఖ మంత్రి ఎస్ ఎస్ సవిత ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు తెలుగుదేశం నాయకులు శ్రీరామ్ యాదవ్ నంజుండ త్రివేంద్ర నాగరాజు రెడ్డి లు తెలిపారు. గురువారం పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంబరాల కరపత్రాలను వారు విడుదల చేశారు. 13వ తేదీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించబడతాయన్నారు. ముగ్గుల పోటీలలో విజేతలైన మహిళలకు మొదటి బహుమతిగా 10,000 రెండవ బహుమతి 5000 మూడవ బహుమతి మూడు వేలు రూపాయలు అందించడం జరుగుతుందన్నారు పోటీలలో పాల్గొనే వారికి షరతులు వర్తిస్తాయన్నారు. 14 15వ తేదీలలో గాలిపటాలు ఎగరవేయడం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడనని వారు తెలిపారు.

# "శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

ధర్మవరం రూరల్ జనవరి 9 ప్రభాతవార్త



బహుమతులు ప్రధ్నాన చేస్తున్న దృశ్యం

పట్టణంలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు రంగుల హరివిల్లులతో మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి మల్లికార్జున మాట్లాడుతూ ముగ్గులనేవి మన భారతీయ సనాతన ధర్మంలో సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేవని చెప్తూ ఇంటిముందు కల్లాపి చల్లి ముగ్గులను రంగురంగుల హరివిల్లులతో తీర్చిదిద్ది పండుగలను జరుపుకోవడం మన ఆనవాయితీ అని విద్యార్థినులను ఉద్దేశించి ముగ్గులతో మీ జీవితాలను అన్వయించుకోండని అది ఎలాగ అంటే మీ జీవితమని ముగ్గులు రంగుల హరివిల్లులతో సర్వాంగ సుందరంగా నిర్మించుకోవాలంటే మీ వ్యక్తిత్వం నడవడిక నిజాయితీగా, ధైర్యంగా, ఆరోగ్యంగా ఉండేటట్లు చూసుకుంటే తద్వారా మీకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సాయి, డైరెక్టర్ జగదీష్ కళా శాల అధ్యపక బృందం పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ముస్తాబైన ఆలయాలు

**-వైష్ణవాలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు**

ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త





ఉరవకొండ పట్టణంలోని గోపాలకృష్ణ దేవాలయం

వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదినం కోసం వైష్ణవాలయాలు సర్వాంగ సుందర ంగా ముస్తాబయ్యాయి. పట్టణంలోని 10వ వార్డు భద్రప్పబావివద్దగల పురాతన లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణ వీధిలోగల పాండురంగస్వామి ఆలయం, వీరశైవ నగర్‌లోని విఠల్ రుక్మిణీ ఆలయం, జాతీయ రహదారికి పక్కనగల గోపాలకృష్ణుని ఆలయంతోపాటు మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలోని లక్ష్మినరసింహస్వామి ఆలయాల్లో భక్తులకు తెల్లవారుజాము నుండే ఉత్తర ద్వార దర్శనం కల్పించడానికి ఆలయ కమిటీలు, అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. వజ్రకరూరు మండల కేంద్రంలోని జనార్ధన వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిను పురస్కరించుకొని లక్ష లక్ష దీపారాధణ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని భద్రప్ప బావివద్దగల లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏడాది తరహాలోనే అభిషేకాలు, హోమ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. హాలహాలం, అమృతం రెండూ వైకుంఠ ఏకాదశి రోజే పుట్టాయని, ఈ రోజునే శివుడు హాలాహలాన్ని మింగారని, మహా భారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజునే ఉపదేశించాడని భక్తుల విశ్వాసం.

# నేడు ఉపాధిహామీ పనులపై ఓపెన్ ఫోరం

రామగిరి, జనవరి 9 ప్రభాతవార్త

మండలంలోని ఉపాధిహామీ పనులు జరిగిన వాటిపై గత పది రోజులుగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. వీటిపై శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ఓపెన్ ఫోరం ఉంటుందని ఏపిఓ సూర్యనారాయణ తెలిపారు. ఇందులో మండలంలోని ఉపాధి హామీ పథకం కూలీలు,మొక్కలు నాటిన రైతులు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

# కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలి

**-నిరసన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి**

**-ఉరవకొండలో నిరసన ప్రదర్శన, అంబేద్కర్‌కు ఘన నివాళి**

ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త



నిరసన తెలుపుతున్న డీసీసీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు

పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షులు వై.మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలరెడ్డి పిలుపు మేరకు గురువారం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో అమిత్‌షా రాజీనామా డిమాండ్‌తో ప్రదర్శన, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాని కి పూలమాలవేసి నివాళులర్పించి విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వై.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి ప్రపంచం లోనే ఎంతో గొప్పదైన రాజ్యాంగాన్ని అందించిన యుగపురుషులు, అంబేద్కర్‌పై అమిత్‌షా సిగ్గుమాలిన వ్యాఖ్యలపై యావత్ భారతదేశం రగిలిపోతోందన్నారు. దేశ ఐక్యత, లౌకికవాదం, సమభావాన్ని కాంక్షిస్తూ ఎల్లప్పుడూ వాటికోసం పాటుపడి పోరాడే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి వ్యాఖ్యలను సహించదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుండి నడిపిన జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌లపై ఎప్పుడూ ఏదో రకంగా విమర్శలు చేస్తూనే ఉందన్నారు. అమిత్ షా రాజీనామా కోరుతూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 23 వరకు వివిధ ఉద్యమాలు, ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించి బీజేపీను ప్రజా కోర్టులో నిలదీసే యత్నం చేస్తోందన్నారు. అమిత్‌షా రాజీనామా చేయకుంటే ఆయన్ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డీసీసీ ప్రధాన కార్యదర్శి సోనియా శీనా, ఉపాధ్యక్షులు బ్యాళ్ళ ప్రసాద్, ధనుంజయ, మైజార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, పట్టణ అధ్యక్షులు సుధాకర్, నాయకులు రమేష్, ఓబుళేసు, షోయబ్, చంద్ర పాల్గొన్నారు.

# గర్భిణీలకు వైద్య పరీక్షలు

కనగానపల్లి జనవరి 9 ప్రభాతవార్త



గర్భిణీలకు సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు గురువారం గర్భిణీ స్త్రీలకు డాక్టర్ భానురేఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. గర్భిణీలకు షుగర్, బిపి, ఎయిడ్స్ పరీక్షలు,ప్ సిఫిలిస్ పరీక్షలు ల్యాబ్ నందు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్య అధికారి భానురేఖ మాట్లాడుతూ గర్భిణీలు డాక్టర్ల సలహాలు మేరకు మందులు చెకప్ లు చేయించుకోవాలని ఇలా చేయించుకోవడం వల్ల పుట్టే బిడ్డ ఆరోగ్యంగా పుడతారని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఓ మనోహర్ బాబు, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ విష్ణువర్ధన్ బాబు, ఫార్మసిస్ట్ అమర్నాథ్ గుప్త, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంజెపి కళాశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

గుడిబండ జనవరి 9 ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని బీసీ బాలికల గురుకుల కళాశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ 10వ తేది నుండి 19వ తేదీ వరకు మన సొసైటీ సంక్రాంతి సెలవులు ప్రకటించిందని అధ్యాపకులు ఇచ్చిన డైలీ హోంవర్క్ ను చేయాలని, సెలవులు సరదాలో ప్రమాదకరమైన ప్రదేశాలకు వెళ్లరాదని తల్లీదండ్రులకు ఇంటి పనుల యందు సహకరించాలని అపరిచిత వ్యక్తులతో పరిచయం వద్దని, ఆత్మ గౌరవం,ఆత్మాభిమానం పెంచే విధంగా మీప్రవర్తన ఉండాలని సూచించారు. అలాగే విద్యార్థులు తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ దసరా, సంక్రాంతి మరియు వేసవి సెలవులు మొత్తం కలిపి 70 రోజులు మాత్రమే మీరు తల్లిదండ్రులని మిగతా రోజుల్లో ప్రిన్సిపాల్ ప్రసాద్ తల్లి,తండ్రి, గురువులని కళాశాలలో అందరినీ తమ బిడ్డల కంటే ఎక్కువగా చూసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ కృష్ణ మూర్తితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

# శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముగ్గుల పోటీలు

బెలుగుప్ప, జనవరి 9 ప్రభాతవార్త



బహుమతులు అందజేస్తున్న మండల తెలుగుదేశం పార్టీ నాయకులు

బెలుగుప్ప మండల కేంద్రంలో శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సంక్రాంతి ముగ్గుల పోటీలు మండల రెవెన్యూ అధికారి షర్మిల, మండల కన్వీనర్ టి.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద తిప్పయ్య, జిల్లా కార్యదర్శి మల్లి, కరస్పాండెంట్ వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విద్యార్థుల తల్లులు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అందులో భాగంగా ఈ సాంస్కృతి సంప్రదాయాల పట్ల నిర్వహించడం ఎంతో ఆనందదాయకమైందని విద్యార్థులకు తెలియజేశారు. రెవెన్యూ అధికారి షర్మిల మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి పోటీల్లో పాల్గొన్న తల్లులకు ముగ్గులను చూసి ఎంతో ఆసక్తితో వేశారని, పాల్గొన్న విద్యార్థులకు కూడా సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం బహుమతులను సైతం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, ప్రధానోపాధ్యాయులు సుమ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపోతన భాగవత సప్తాహ కార్యక్రమం

**బెలుగుప్ప, జనవరి 9 ప్రభాతవార్త** : నక్కలపల్లి శ్రీ సీతారామాంజినేయ స్వామి దేవస్తానంలో నిర్వహించబడుతున్న శ్రీపోతన భాగవత సప్తాహ కార్యక్రమానికి మొదటి రోజు అయిన గురువారం 9 జనవరి 2025న ప్రథమ స్కంధం-అశ్వత్థామ పరీక్షన్మ హారాజ ఘట్టంను శ్రీ విద్యానికేతన్, కణేకల్‌క్రాస్ విద్యార్థులు ఆలపించారు. నక్కలపల్లి గ్రామశ్రీసీతా రామాంజినేయుస్వామిదేవస్థానంలో ఈపవిత్ర కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధతో జరుపుకున్నారు. మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని సంరక్షించుకునే ఈ పవిత్ర కార్యక్రమాన్ని ఘనంగాజరుపుకున్నారు.ప్రత్యేకంగా, వివిధగ్రామాల విద్యార్థులను ప్రోత్సహించారు. నక్కపల్లి గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

07ATP09_07ATP09.qxd 09-01-2025 PM 10:45 Page 1



## విశ్వభారతి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ముదిగుబ్బ, జనవరి 9 ప్రభాతవార్త**



సంక్రాంతి సందర్భంగా వివిధ వేషదారణలో విద్యార్థులు

మండల కేంద్రంలోని విశ్వ భారతి పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగువారు ఆనందంగా జరుపుకునే పండుగల్లో సంక్రాంతి పండుగ ప్రధానమైందని సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే సందర్భంలో మకరసంక్రాంతి పండుగను జరుపుకుంటారన్నారు. ధాన్యం పొలాల నుండి ఇంటికి చేరుకునే శుభసందర్భంలో ఇంటిల్లిపాది కలిసి ఆనందంగా బంధుమిత్రులతో కలిసి జరుపుకునే పండుగ భోగి, సంక్రాంతి, కనుమ విశిష్టతను తెలియచేశారు. పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు సాంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంటలు వెలిగించి రంగురంగుల ముగ్గులు పాలపొంగులు, గాలిపటాలు, హరిదాసుల కీర్తనలతో ఆనందంగా సంక్రాంతి సంబరాలను ఒక వేడుకలా నిర్వహించారు. విద్యార్థుల వేషదారణలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమాలు పాఠశాల కరస్పాండెంట్ సింగారెడ్డి, చంద్రహాసరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

**తాడిపత్రిటౌన్, జనవరి 9 ప్రభాతవార్త**



క్యూ లైన్లను ఏర్పాటు చేసిన దృశ్యం

తాడిపత్రి పట్టణంలోని పురాతన శ్రీచింతల వేంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఉదయం అర్చకులు మురళిస్వామి సుప్రభాతసేవ, శ్రీవారికి అభిషేకాలు, అమ్మవారికి అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు హాజరుకానుండడంతో ఆలయంలో భారీకేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు దామోదర్‌దాస్, పరిశె చంద్రశేఖర్, చందు, తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో పాటు విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. హాజరైన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఆలయం ఆవరణలో అన్నమయ్య కీర్తనలను ఆలపించనున్నారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచింతల వేంకటరమణస్వామి గ్రామోత్సవాన్ని మేళతాళాల నడుమ అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు.

## రాయలసీమ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

**పుట్లూరు, జనవరి 9 ప్రభాతవార్త**



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

మండల కేంద్రంలోని రాయలసీమ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు గాలిపటాలు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకరస్పాండెంట్ రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేములపాడులో ముగ్గుల పోటీలు

**యాడికి, జనవరి 9 ప్రభాతవార్త**



గెలుపొందిన వారికి చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని వేములపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2లో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంస్కృతి, సాంప్రదాయాలకు పెట్టింది పేరైన మకరసంక్రాంతి విశిష్టత గురించి తెలియచేశారు. ప్రస్తుతం ఆధునిక ప్రపంచంలో పాత తరం సాంప్రదాయాలను గుర్తు చేయాలని ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి మొదటి, రెండవ, మూడవ, నాల్గవ బహుమతులుగా చీరలు, పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. దాత రామచంద్రారెడ్డి ఆర్థిక సాయంతో బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కాశెప్ప, సచివాలయం మహిళా పోలీసు దివ్య, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ నందిని, పాఠశాల కమిటీ చైర్మన్ గడ్డం బాలాజీ, వైస్‌చైర్మన్ వరలక్ష్మి, స్థానిక వార్డు సభ్యుడు కుళ్లాయప్ప, సిఆర్‌పి నరేంద్రబాబు, పాఠశాల ఉపాధ్యాయులు రవీంద్ర, ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ, విద్యార్థుల తల్డింద్రులు పాల్గొన్నారు.

## విలేకరులను దూషించిన ప్రభుత్వ అధికారి క్షమాపణలు చెప్పాలి

**పుట్లూరు, జనవరి 9 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

విలేకరులను దూషించిన ప్రభుత్వ అధికారి అయిన ఇఒఆర్‌డి జిలాన్‌బాష వారికి క్షమాపణలు చెప్పాలని సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఒఆర్‌డి జిలాన్‌బాష మీడియా వారిని నోటికివచ్చినట్లు దుర్భాషలాడడం దారుణమన్నారు. అధికారపార్టీ అయినా, ప్రతిపక్షమైన రాజకీయ నాయకులు అక్రమాలకు పాల్పడినా ప్రభుత్వ అధికారులు ప్రజలకు సరైన సేవలు అందించపోయినా ప్రజల పక్షాన వుండి అనునిత్యం ప్రజల తరుపున పోరాడే పత్రికా విలేకరులను ఇలా దుర్బాషలాడడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇఒఆర్‌డి జిలాన్‌బాష కార్యాలయానికి వచ్చే ప్రజలతో కూడా దురుసుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారన్నారు. వెంటనే ఆయన దురుసు తగ్గించుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోమారు పత్రికా విలేకరులపై గాని ప్రజలపై గానీ దురుసుగా వ్యవహరిస్తే జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇవ్వడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గం అధ్యక్షులు రాజు, చేతివృత్తిదారుల మండల అధ్యక్షులు ఓబులపతి, తక్కళ్లపల్లి శాఖ కార్యదర్శి బాలు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చచేస్తున్న వడ్డెర్ల సంఘం సభ్యులు

**నల్లచెరువు, జనవరి 09 ప్రభాతవార్త**

నల్లచెరువు మండల కేంద్రంలోని వడ్డెర్ల సంఘం అధ్యక్షులు దేరింగుల తిరుపాల్, వడ్డెర్ల సంఘం సభ్యులు కలిసి వడ్డెర్ల ఆరాధ్య దైవం స్వాతంత్ర సమర యోధులు శ్రీ వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా జనవరి 11వ తేదీన అధికారికంగా ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌లకు వడ్డెర్ల తరుపున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతూ అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు, ఉపాద్యక్షులు వేమయ్య, కూటమి నాయకులు జెరిపిటి శంకర, ఇడగొట్టు ఆనందు, ఎంఆర్‌పిఎస్ భయప్ప, ఇ.అమర్నాథ్, జె. వెంకటేశు, ఈ. వెంకటరమణ, శేఖర రాజు, శ్రీనివాసులు, దొడ్డి బాబు, దొడ్డప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి మెటిరీయల్ పంపిణీ



మెటీరియల్‌ను చూపుతున్న విద్యార్థులు

**తనకల్లు, జనవరి 09 ప్రభాతవార్త**

తనకల్లు మండల పరిధిలోని కోటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటిఎఫ్ నాయకులు మెటిరీయల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ నాయకులు సత్యన్న, సేన కొక్కంటిక్రాస్ ఆధ్వర్యంలో 12మంది విద్యార్థులకు స్టడీ మెటిరీయల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం యూటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ అనుభవగ్నులైన ఉపాద్యాయులచే రూపొందించబడ్డ 10వ తరగతి స్టడీ మెటిరియల్‌ను ప్రతి సంవత్సరం ప్రచురించి విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోషించాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థులు బాగా చదివితే వారి తల్లిదండ్రులకు, గురువులకు, సమాజానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ సందర్భంగా స్టైడీమెటిరీయల్, మోడల్‌పేపర్లు ఉచితంగా అందించిన సత్యన్న, సేన కొక్కంటి క్రాస్ సభ్యులకు విద్యార్థులు, ఉపాద్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు బాలకృష్ణరెడ్డి, ఉపాద్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

**యాడికి, జనవరి 9 ప్రభాతవార్త**



వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న దృశ్యం

మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్చంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా ప్రకటించడం సంతోషించతగ్గ విషయమని మధురాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు దేరంగుల నాగశేఖర్, వడ్డెర సంఘం కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో గర్భవతులకు అన్నదానం

**యాడికి, జనవరి 9 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామం లోని ప్రభుత్వాసు పత్రిలో గురువారం ప్రత్యేక వైద్యపరీక్షల కోసం వచ్చిన గర్భవ తులకు అన్నదానం నిర్వహించినట్లు మండల విద్యాధికారు లు తెలిపారు. సివిఆర్ డెవలప్‌మెంట్ సొసైటీ రాయలచెరువు దాతలు డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఏఐజి ఆసుపత్రి హైదరాబాద్, సివి రమణారెడ్డిల సహకారంతో యాడికి ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశ్రామికవేత్త రంజిత్‌కుమార్ సహకారంతో రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు అన్నదానం నిర్వహించారు.

## పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**యాడికి, జనవరి 9 ప్రభాతవార్త**



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న దృశ్యం

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరువుకున్నారు. ఇందులో భాగంగా మండలంలోని రాయలచెరువు గ్రామంలోని వికాస్ పాఠశాలలో కరస్పాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి సాంప్రదాయాలకు పెట్టింది పేరని, ఇలాంటి సాంప్రదాయాలను సంస్కృతులను మరువకుండా మనమంతా పండుగలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో తీపి పొంగలి తయారు చేసి అందరికి ప్రసాదంగా పంపిణీ చేశారు. విద్యార్థులు రంగవల్లులతో సంక్రాంతి శోభ ఉట్టిపడేలా చేశారు. ఒకవైపు ముగ్గులు వేస్తుండగా మరోవైపు విద్యార్థులు తమ శాస్త్రీయ నృత్యాలతో వీక్షకులను ఎంతగానో అలరించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి భానుప్రియ, రెండవ బహుమతి అలేఖ్య, మూడవ బహుమతి సమన్విత గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రజిత, ఉపాధ్యాయులు అనిత, అమల, షకీలా, జాహ్నవి, ధరణి, సంధ్య, రమాదేవి, ప్రియాంక, వెంకటపతిరాజు, మహబూబ్‌బాష, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## మాటతీరు మార్చుకో

### -పుట్లూరు ఇఒఆర్‌డి జిలాన్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

**పుట్లూరు, జనవరి 9 ప్రభాతవార్త**

మాటతీరు మార్చుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలని పుట్లూరు ఇఒఆర్‌డి జిలాన్‌బాషపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరులను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా గాండ్లపాడు సమీపంలో నిర్మిస్తున్న గోడౌన్ విషయంలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఓ పంచాయతీ కార్యదర్శి, ఇఒఆర్‌డిపై ఎమ్మెల్యే కార్యాలయంలో ఫైర్ అయ్యారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా అధికారులు విధులు నిర్వహిస్తే సహించేదిలేదని తేల్చిచెప్పినట్లు సమాచారం. వివిధ ఆరోపణలపై విచారణ చేయాలని ఎంపిడిఒను ఆదేశించినట్లు తేదేపా నాయకులు తెలిపారు.

## ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

### - ఎమ్మెల్యే కందికుంట



హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, జనవరి 9 ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనం డ్రైవ్ చేసే ప్రతి ఒక్క వాహన దారుడు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని కదిరి ఎమ్మెల్యే క ందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టిఓ కార్యాలయంలో వాహన దారులకు హెల్మెట్ వాడకం, ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్‌టిఓ శ్రీనివాస్, ఎంవిఐ వర ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిలో జరిగిన ఘటన దురదృష్టకరం

### - ముక్కోటి ఏకాదశికి భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూద్దాం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, జనవరి 9 ప్రభాతవార్త**

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని టోకన్ల జారీలో తోపులాట ఘటన దురదృష్ట కరమైందని, ఆ ఘటనతో మనందరిపై బాధ్యత పెరిగిందని ఎమ్మెల్యే వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సమావేశం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రీవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భారీగా భక్తులు విచ్చేస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో ముక్కోటి ఏకాదశిని విజయవంతం చేయాలన్నారు. తమ వంతు బాధ్యతగా అప్రమత్తంగా ఉంటామని భక్తులు కూడా సహకరించాలని, విజ్ఞప్తి చేస్తున్నామని, ప్రతి ఒక్క భక్తుడిని సంతోషంగా ఇంటికి పంపే బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డిఓ వివిఎస్ శర్మ, డిఎస్‌పి శివనారాయణస్వామి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి ఘటన బాధాకరం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు షేక్ బాబ్జాన్

**నంబులపూలకుంట, జనవరి 9 ప్రభాతవార్త**

తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్లిన భక్తులు చనిపోవడం చాలా బాధాకరమని బిజెపి మైనార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, మండల అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వామివారి దర్శనార్థం లక్షలాదిగా భక్తులు వస్తారని ముందుగానే అంచనా ఉన్నప్పటికీ టిటిడి పాలక మండలి, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇది తగదని పేర్కొన్నారు. తొక్కిసలాటలో మరణించిన ప్రతి కుటుంబానికి టిటిడిలో ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రానున్న రోజుల్లో ఏ ఒక్క ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మొత్తం టిటిడి పాలక మండలి, ప్రభుత్వంపై ఉందని, భక్తుల విషయంలో ఏ మాత్రం అలసత్వం తగదన్నారు. కార్యక్రమంలో మండల బిసి మోర్చా అధ్యక్షుడు వెంకటరమణ, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు చాంద్ బాషా తదితరులు ఉన్నారు.

## హరీష్ పాఠశాలలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**కదిరి, జనవరి 9 ప్రభాతవార్త**

కదిరి రూరల్ మండలంలోని ఎరుకుల వాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థుల తల్లిదం డ్రులు వేసిన రంగురంగు ముగ్గులు ఆకట్టుకున్నాయి. దీంతో పాఠశాల ప్రాంగణంలో ముందుగానే సంక్రాంతి శోభ నెలకొంది. పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియపరిచేందుకే ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు పండుగల పట్ల ఆసక్తి పెరగడంతోపాటు సాంస్కృతిక సాంప్రదాయాలు తెలుస్తాయన్నారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తొక్కిస లాటలో మృతి చెందిన వారి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి..

### డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు రాంప్రసాద్ నాయక్, చెరుకూరి గంగులయ్య, ఆరుద్ర శ్రీనివాసులు.

**తనకల్లు, జనవరి 09 ప్రభాతవార్త:**

తిరుపతి తొక్కిసలాట సంఘటనపై మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు రాంప్రసాద్ నాయక్, చెరుకూరు గంగులయ్య, ఆరుద్ర శ్రీనివాసులు తెలిపారు.

ఈ సందర్బంగా గురువారం వారు స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ మృతి చెందిన వారి ఆత్మ శాంతి కలగాలని వ్యక్తం చేశారు. స్వామి దర్శనం కోసం టోకెన్ జారీచేసిన కేంద్రం వద్ద తొక్కిసలాట జరగడం బాధాకరమన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తక్షణమే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న త్వరగా కోలుకోవాలని, ఇలాంటి ఘటన రాష్ట్రంలో ఎక్కడ జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## డిటిఎఫ్ ఆధ్వర్యంలో 11న మహా ధర్నా



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డిటిఎఫ్ నాయకులు

**ఓబుళదేవరచెరువు, జనవరి 9, ప్రభాతవార్త**

ఈ నెల 11న విజయవాడ కేంద్రంగా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటీయఫ్) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మహా ధర్నా చేపట్టినట్లు జిల్లా అధ్యక్షులు కట్టుబడి గౌస్ లాజమ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మధ్యంతర భృతి ఊసేలేదని, సరెండర్ లీవ్ చెల్లింపులు పిఎఫ్ రుణాలు ఏపీజేఎల్ఐ రుణాలు పెండింగ్ వున్న బకాయిలను వెంటనే చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు టైం స్కేల్ మంజూరు చేయాలని ,ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలుగా పెంచాలని మరియు క్రమబద్ధీకరణ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ జనవరి 11న ధర్నా.. చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి డిటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నాకు సంబంధించిన క రకరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి నర్సింహులు.విది, సోమశేఖర్ నాయక్, నాగరాజు,అతావుల్లా, సిద్దయ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లులేని వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలి

**ఓబుళదేవరచెరువు, జనవరి 9, ప్రభాతవార్త**



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

అర్హులైన ఇల్లులేని నిరుపేదలు, వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని బిజెపి మండల అధ్యక్షుడు వీరాంజినేయులు తహశీల్దార్ అనంతాచారిని కోరాడు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం బిజెపి నాయకులతో కలసి మండల వ్యాప్తంగా ఇళ్ల లేని నిరుపేదలు చాలామంది ఉన్నారన్నారు. యం కొత్తపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 216లో 2.71 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అర్హులైన వారిని గుర్తించి ఇంటి నివేశస్థలంతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోది ప్రవేశపెట్టి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా గృహా నిర్మించుకునేందుకు వెసలుబాటు కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల వెంకటరమణ, ఏబివిపి వాసుదేవ్, సుదర్శన్‌రెడ్డి, మనోహర్ తదిరులు పాల్గొన్నారు.

## రెయిన్బో పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న హెచ్‌ఎం జయసింహారెడ్డి

**ఓబుళదేవరచెరువు, జనవరి 9, ప్రభాతవార్త**

స్థానిక రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జయసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా పాఠశాల ప్రాంగణంలో రంగవల్లికలు వేశారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయ వస్త్రదారణతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అకర్షించాయి. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ప్రథమ విజేత మాధవి, ద్వితియ లక్ష్మిదేవి, శ్రీదేవి, తృతీయ విజేతల రెడ్డెమ్మలకు ప్రధానోపాధ్యాయుడు జయసింహారెడ్డి బహుమతులు ప్రధానం చేశారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



సిఎంకు పాలాభిషేకం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

**ఓబుళదేవరచెరువు, జనవరి 9, ప్రభాతవార్త**

వడ్డే ఆరాధ్యదైవం, రేనాటి వీరుడు ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగల నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మండలంలోని వడ్డెర సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియచేశారు. టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి జెరిపిటి అంజినప్ప, ఎంపీటిసి భైముతక శ్రీనివాసులు, నియోజకవర్గ బిసి సెల్ కార్యదర్శి ఇడగుట్టు ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, ఎఫ్ఏ పీట్ల మనోహర్, మాజీ డీలర్ చంద్రాయుడు, జెరిపిటి ఆంజనేయులు, బత్తినిపల్లి చలపతి, డ్రైవర్ జయచంద్ర, డీలర్ గంగులప్ప, జెరిపిటి ప్రసాద్, ఆటో రామాంజినేయులు తదితరులు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.... వడ్డెర్ల ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న జయంతి జనవరి 11న రాష్ట్ర పండుగల నిర్వహించాలని గత ఏడాది నవంబర్ 19న అసెంబ్లీ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వడ్డెర్లకు మద్దతుగా ప్రస్తావించడం వల్లనే సిఎం చంద్రబాబు నాయుడు స్పందించారన్నారు. వడ్డెర్ల మనోభావాలను గుర్తించి సిఎం ఆదేశాల మేరకు బీసి సంక్షేమ శాఖ జీఓ విడుదల చేయడం పట్ల సిఎం చంద్రబాబుకు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, బీసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. అదే విధంగా వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చితే తమ బిడ్డలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి తమ తలరాతలు మారుతాయన్నారు. అనంతరం సిఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చిత్రపటాన్ని ఉంచి పాలాభిషేకం చేశారు.

## అంగన్వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

**నల్లచెరువు, జనవరి 09 ప్రభాతవార్త:**

మహిళ అబివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సాధికారత శాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నల్లచెరువు మండల పరిధిలోని ఉన్నటువంటి అంగన్వాడీ కార్యకర్త మినీ అంగన్వాడీ కార్యకర్త మరియు సహాయకులకు ఖాళీగా ఉన్న పోస్టుల కొరకు నియామిక నోటిఫికేషన్ విడుదల అయిందని నల్లచెరువు ఐసిడిఎస్ అధికారిని సిడిపిఓ గంగరత్నమ్మ గురువారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. నల్లచెరువు మండల పరిధిలోని ఉబిచర్ల అంగన్వాడీ కార్యకర్త 1ఎస్సీ, హెల్పర్స్ ఎస్సీ 1, దేవిరెడ్డిపల్లి హెల్పర్స్ 1, ఓపెన్ క్యాటగిరి కింద అప్లై చేసుకోవచ్చునని, ఇందుకు షరతులు పదవ తరగతి పాస్ కాబడి ఉండాలన్నారు. 21సంవత్సరాల నుండి 35సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని సూచించారు. స్థానిక వివాహిత మహిళ అయిఉండాలని తెలిపారు. 25-01-2025 సాయంత్రం లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ గంగరత్నమ్మ తెలిపారు.

